క్లుప్తంగా

రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు



ఆరిలోవ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

ఆరిలోవ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ఆరిలోవ పోలీసులు మంగళవారం రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఆరిలోవలో తెల్లవారుజామున సీఐ హెచ్.మల్లేశ్వరరావు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లతో కలిసి ఇబ్బందికరమైన రౌడీషీటర్ల ఇళ్లు తనిఖీ చేశారు. వారి నుంచి ఎలాంటి ఇబ్బంది కలుగుతుందో స్థానికుల నుంచి ఆరా తీశారు. దుర్గానగర్, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ, నలభై గజాల కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద మాదక ద్రవ్యాలు, ఇతర వస్తువులు లభించలేదని ఆయన తెలిపారు.

ముగిసిన ఖేల్ కూద్ పోటీలు



చదరంగం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే స్కూల్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఖేల్ కూద్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీలు ఈ నెల 17న ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో బీవీకే సంస్థల నుంచి 592 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వారిలో 377 మంది బాలురు కాగా 215 మంది బాలికలున్నారు. ఈ పోటీలను 32 మంది పీడీలు పర్యవేక్షించారు. ఆయా విద్యార్థులకు జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చదరంగం, వాలీబాల్, యోగా తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో జిగుర ప్రతాప్ సింహ శాస్త్రి, బీవీకే చైర్మన్, ఏయూ మాజీ వీసీ జి.నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

అప్పుఘర్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న చిరంజీవి అభిమానులు

ఎంవీపీ కాలనీ: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మంగళవారం 18వ వార్డు అప్పుఘర్‌లో ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర చిరంజీవి యువత అసోసియేషన్ అధ్యక్షుడు ఎలమంచిలి సదాశివరావు, అసోసియేషన్ అప్పుఘర్ విభాగం అధ్యక్షుడు చీపల్లి ఎల్లాజీ స్వామి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ముందుగా అసోసియేషన్ ప్రతినిధులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పేదలకు ఉచిత వైద్యశిబిరంతోపాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అప్ సబ్‌కి ఆవాజ్, కేర్ హాస్పిటల్, అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి, స్థానిక నాయకులు, అసోసియేషన్ ప్రతినిధులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకరమఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11 వేల 116 విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

నివాసాల మధ్యే స్క్రాప్ దుకాణాలు



సుందరయ్యకాలనీలో నివాసాల మధ్య స్క్రాప్ దుకాణం

- ఆరిలోవలో విచ్చలవిడిగా నిర్వహణ
- ఖాళీ డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువుల్లో వర్షపు నీటితో దోమల వృద్ధి
- జ్వరాలతోపాటు దుర్వాసన భరించలేకపోతున్న స్థానికులు
- నివాసుల రాకపోకలకూ తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో విచ్చలవిడిగా తుక్కు (స్క్రాప్) నిల్వలు పేరుకుపోతున్నాయి. స్క్రాప్ దుకాణాలు నివాసాల మధ్యే నిర్వహిస్తుండడంతో దోమలు వృద్ధి చెంది... జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానికులకు పెద్ద సమస్యగా మారిపోయింది. ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ సంచులు, తుప్పు పట్టిన వాషింగ్ మిషన్లు, బీరువాలు, ఫ్రిజ్‌లు, పేపర్లు, అట్టలు, ఇనుప ఊచలు, తప్పు పట్టిన ఇనుప రాడ్లు, పనికిరాని ఎలక్ట్రికల్ వస్తువులు, విరిగిన కుర్చీలు, తదితర వాటితో ఈ దుకాణాల్లో నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటి నుంచి వచ్చిన దుర్వాసన, ధూళితో ఇబ్బంది పడటంతోపాటు వర్షం నీరు వాటిలో చేరి నిల్వ ఉండిపోతోంది. ఆ నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అవి పరిసరాల్లోని నివాసాల్లోకి చేరి స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వర్షాకాలం కావడంతో దోమ కాటుకు **గురై జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ వైద్య, ఆరోగ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా స్క్రాప్ వాపారాలు పెరిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఆరిలోవ ప్రాం**తంలో సుందరయ్యకాలనీ, పార్వతినగర్, చినగదిలి, ఆరిలోవకాలనీతోపాటు శ్రీకాంత్‌నగర్‌లో రెండు చోట్ల స్క్రాప్ దుకాణాలు ఇళ్ల మధ్యలోనే నిర్వహిస్తున్నారు. ఈ వ్యాపారం కాలనీల్లోని నివాసాల మధ్య నిర్వహించడాన్ని అధికారులు నిషేధించాలని స్థానికులు కోరుతున్నారు. దోమలతో పాటు ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రితం శ్రీకాంత్‌నగర్‌లో ఓ తుక్కు దుకాణంలో రేగిన మంటలు, గత ఏడాది పరవాడ ప్రాంతంలో ఓ **తుక్కు దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదాన్ని గుర్తు చేసుకుని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీటిని జనావాసాలకు దూరంగా తరలించడానికి** అధికారులు చర్యలు చేపడితే బాగుంటుందని భావిస్తున్నారు.

జీవీఎంసీ 12వ వార్డు పరిధి శ్రీకాంత్ నగర్, చినగదిలి, పార్వతినగర్, సుందరయ్యకాలనీలో స్క్రాప్ వ్యాపారం నివాసాల మధ్య చేస్తున్నారు. సుందరయ్య కాలనీలో ఓ వ్యాపారి తాను లీజుకు తీసుకున్న రెండు స్థలాలతోపాటు పక్కనే ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలాన్ని కూడా అనధికారికంగా వ్యాపారానికి వినియోగించుకుంటున్నాడు. ఆయా స్థలాల్లో వందల కొద్దీ తుక్కు మూట**లు నిల్వ చేస్తున్నాడు.** వాటిని ఇతర ప్రాంతాల **నుంచి తీసుకొచ్చినప్పు**డు, దుకాణం నుంచి వేరే **చోటకు తరలించేటప్పు**డు వ్యానులతో హడావిడి చేస్తుంటారు. ఇక్కడ చిన్న రోడ్డు కావడంతో నివాసాల మధ్య రాత్రి పగలు వాహనాలతో సరకు తరలిస్తుండటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాంత్‌నగర్‌లో రెండుచోట్ల తుక్కు దుకాణాలు నివాసాల మధ్యే నిర్వహిస్తున్నారు. వాటిలో మూడేళ్ల క్రితం ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. పార్వతినగర్‌లో ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్న తుక్కు దుకాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల మూటలు రోడ్డు మీదే నిల్వ చేస్తున్నారు. వాటిని వ్యానులలో తరలించేటప్పుడు ఆ దారిన వెళ్లే వాహనచోదకులకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. చినగదిలిలో ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌నే తుక్కు వ్యాపారానికి ఉపయోగించుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇక్కడ ఫుట్‌పాత్ వినియోగించడానికి స్థానికులకు వీలు లేకుండాపోయింది. వర్షాలు కురుస్తున్న సమయంలో తుక్కు మూటల నుంచి దుర్వాసన వస్తోందని... అది భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా నివాసాల మధ్య స్క్రాప్ దుకాణాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.



స్క్రాప్‌తో రోడ్డుపై నిలిపిన వాహనం



సుందరయ్యకాలనీలో ప్రభుత్వ స్థలంలో నిల్వ చేసిన తుక్కు

దుర్వాసన భరించలేకపోతున్నాం

తుక్కు దుకాణంలో నెలల తరబడి మూటలు, పాడైన వస్తువులు నిల్వ చేస్తున్నారు. వాటి నుంచి వచ్చే దుర్వాసనతోపాటు దోమలు పెరిగిపోతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు అవి తడిసిపోయి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నాం. నిల్వ ఉన్న డబ్బాల్లో వర్షం నీరు చేరడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. తుక్కును వ్యానుల్లో తరలించేటప్పుడు రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి వాటిపై చర్యలు తీసుకోవాలి.

– పి.సత్యనారాయణ, శ్రీకాంత్‌నగర్

దోమల స్వైరవిహారంతో ఇబ్బందులు

స్క్రాప్ సామగ్రి బస్తాలతో నిల్వ చేస్తున్నారు. ఇవి ఇళ్ల మధ్యలోనే ఉన్నాయి. వీటి వల్ల దోమలు పెరిగిపోతున్నాయి. సుందరయ్య కాలనీలో చిన్న రోడ్డు పక్కనే మూడు స్థలాల్లో తుక్కు మూటలు కుప్పలుగా వేసి నిల్వ చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అవి కుడుతూ నిద్ర లేకండా చేస్తున్నాయి. వాటివల్ల జ్వరాల బారిన పడుతున్నాం. ఇలాంటి వాటిని నివాసాలకు దూరంగా తరలించాలి.

– కె.రామకృష్ణ, సుందరయ్య కాలనీ

చెత్త కుండీలా గెడ్డ



గెడ్డలో మర్రి చెట్టు ఊడలు అడ్డంగా ఉండడంతో నిలిచిపోయిన చెత్త

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి 40 గజాల కాలనీలో గెడ్డ చెత్త కుండీలా మారింది. ఇక్కడ గెడ్డ అంచున ఉన్న పెద్ద మర్రి చెట్టు ఊడలు వేలాడుతున్నాయి. కొన్నాళ్లుగా ఆ ఊడలు గెడ్డలో నాటుకుపోవడంతో మురుగు నీరు కిందకు పోవడానికి అడ్డంగా మారింది. దీంతో పై ప్రాంతాల నుంచి మురుగు నీటిలో వచ్చిన చెత్త ఇక్కడ పేరుకుపోతోంది. దీంతోపాటు స్థానికులు కూడా ఈ గెడ్డలో ఇష్టారాజ్యంగా చెత్త వేసేస్తున్నారు. కిందకు వెళ్లే మార్గం మర్రి చెట్టు ఊడలతో మూసుకుపోవడంతో చెత్త నిలిచిపోతోంది. అది కుళ్లిపోయి దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించడానికి ప్రయత్నించినా ఊడలు అడ్డుగా ఉండడంతో వీలుకాని పరిస్థితి నెలకొంది. మంగళవారం ఇక్కడ గెడ్డలో చెత్త తొలగించడానికి ప్రయత్నించినా ఊడలు అడ్డం ఉండటంతో సరిగా శుభ్రం చేయలేకపోయారు. జీవీఎంసీ అధికారులు ఈ ఊడలు, మర్రి చెట్టు కొమ్మలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎంవీపీ కాలనీ: రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, వివాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తప్పవని ఎంవీపీ సీఐ మురళి హెచ్చరించారు. మంగళవారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. మంచి ప్రవర్తన కలిగిన వారిపై షీట్లు ఎత్తేసేందుకు కూడా కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతోపాటు వివాదాల్లో, గొడవల్లో తల దూర్చినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ఎంవీపీ పరిధిలో ఓ రౌడీషీటర్ వద్ద కొంత నగదుతోపాటు మరో రౌడీషీటర్ వద్ద కత్తి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. దీని వెనుక ఎలాంటి వివాదం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అత్యున్నత ప్రమాణాలే దేశాభివృద్ధికి కీలకం

బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మీనాక్షి గణేశన్



మీనాక్షి గణేశన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజశేఖర్, తదితరులు

విశాఖ విద్య: అత్యున్నత ప్రమాణాలతో ఉత్పత్తులను తయారు చేయడం దేశాభివృద్ధిలో కీలకమని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సౌత్) మీనాక్షి గణేశన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం సమావేశ మందిరంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాలతో సంయుక్తంగా బీఐఎస్ నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ 'స్టాండర్డైజేషన్ అండ్ కన్‌ఫార్మిటీ అసెస్‌మెంట్'ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒక సంస్థకు, ఒక వ్యవస్థకు శక్తినిచ్చేవి కేవలం ప్రమాణాలేనని అన్నారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా అధ్యాపకులకు భారతీయ, అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023లో ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఐఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకొని విభిన్న కార్యక్రమాలను, పరిశోధనా ప్రాజెక్టులను నిర్వహిస్తోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాణాలను కరిక్యులంలో భాగంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. వర్సిటీలో బీఐఎస్ శాఖలను స్థాపించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ శతాబ్ది సంవత్సరంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో మంచి పరిణామం అని చెప్పారు. ఇప్పటికే మూడు విభాగాల్లో బీఐఎస్ విద్యార్థి శాఖలను ఏర్పాటు చేశామని, మరొక నూతన శాఖను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎఫ్‌డీపీ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మీనాక్షి గణేషన్‌ను వీసీ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

విమానాల రూపకల్పనలో డిజైన్ థింకింగ్ కీలకం



ప్రొఫెసర్ పడాల్‌ను సత్కరిస్తున్న ఎఫ్‌డీపీ ప్రతినిధులు



పాల్గొన్న పాలిటెక్నిక్ ఫ్యాకల్టీ

మురళీనగర్: విమానాల రూపకల్పనలోని వైఫల్యాలను గుర్తించి, వాటిని అధిగమించేందుకు డిజైన్ థింకింగ్ విధానం ఉపయోగపడుతుందని ఆంధ్ర విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ కె.టి.బి. పడాల్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్‌పై జరిగిన శిక్షణలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొని రెండవ రోజు ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విమానాల డిజైన్‌లో సంఖ్యా పద్ధతుల ప్రాముఖ్యత, క్రైస్టలాగ్రాఫికల్ వైఫల్యాలు, వాటి పరిష్కారాలపై విశ్లేషణాత్మకంగా వివరించారు. రాఘవ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ హేమలత మాట్లాడుతూ మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎంసీడీఎం) అప్రోచ్ ప్రాముఖ్యతను వివరించారు. బహుళ ప్రమాణాల ఆధారంగా కచ్చితమైన డిజైన్ ఎంపిక, సమస్య పరిష్కారం, పరిశోధనాత్మకత దిశలో నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను ఉదాహరణలతో వివరిస్తూ, ఈ పద్ధతిని ఎఫ్‌డీపీకి అనుసంధానించే మార్గాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేబీటీ పడాల్‌ను సత్కరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కో-ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ రాజు, కో-కోఆర్డినేటర్ ఎం.భరణి పర్యవేక్షించారు.

కైలాసగిరిపై టాయ్ ట్రైన్‌కు రెండు బోగీలే



ట్రాక్‌పై సిద్ధం చేసిన టాయ్ ట్రైన్



మరమ్మతులకు గురవడంతో వేరు చేసిన ఏసీ బోగీ

ఆరిలోవ: నగరంలోని పర్యాటక కేంద్రం కైలాసగిరిపై సందర్శకులను తిప్పే విశాఖ దర్శిని సర్క్యూట్ ట్రైన్ (టాయ్ ట్రైన్)కు రెండు బోగీలే మిగిలాయి. ఈ రెండు బోగీలతో మంగళవారం నుంచి దీన్ని పునఃప్రారంభించారు. ఇక్కడకు వెళ్లిన పర్యాటకులను ఎంతగానో అలరించే ఈ ట్రైన్‌లో ఓ బోగీ మూలకు చేరింది. దీంతో ఇక నుంచి దీనికి రెండు బోగీలే మిగిలాయి. సుమారు 15 సంవత్సరాలుగా ఇక్కడ టాయ్ ట్రైన్‌పై పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు. దీనిలో మూడు బోగీలుండేవి. వాటిలో రెండు ఏసీ, ఒకటి నాన్ ఏసీ బోగీలు. కొన్నేళ్లుగా ఇది తరచూ మరమ్మతులకు గురవడం, దాన్ని అధికారులు బాగుచేయడం జరుగుతుండేది. అయితే సుమారు 5 నెలలుగా ఇది మరమ్మతులకు గురై పూర్తిగా మూలకు చేరింది. ఈ ఏడాది మార్చి 17న సందర్శకులను తిప్పుతుండగా పట్టాలు తప్పింది. అప్పటి నుంచి మూలకు చేరి సందర్శకులకు దూరమైంది. వీఎంఆర్‌డీఏ అధికారులు కూడా దీన్ని పట్టించుకోకుండా వదిలేశారు. దీనిపై పర్యాటకుల్లో అసంతృప్తి పెరగడంతో ఎట్టకేలకు అధికారులు దిగి వచ్చారు. మరమ్మతులకు గురైన బోగీని ట్రైన్ నుంచి తొలగించి పక్కన పెట్టేశారు. మిగిలిన రెండు బోగీలనే తిప్పడానికి మంగళవారం సిద్ధమయ్యారు. మరమ్మతులకు గురైన ఏసీ బోగీ పక్కన పెట్టడంతో ప్రస్తుతం ఈ టాయ్ ట్రైన్‌కు ఒక ఏసీ, మరొక నాన్ ఏసీ బోగీ మాత్రమే మిగిలాయి. మంగళవారం సాయంత్రం దీన్ని పునఃప్రారంభించినప్పటికీ సందర్శకులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఐదు నెలలగా ఇది మూలకు చేరడంతో దీని ద్వారా వీఎంఆర్‌డీఏకి రావాల్సిన ఆదాయానికి గండిపడింది. దీని ద్వారా నెలకు సుమారు రూ.10 లక్షలు ఆదాయం లభించేదని సిబ్బంది చెబుతున్నారు.

ఎట్టకేలకు నష్ట పరిహారం చెల్లింపు

అగనంపూడి: విశాఖ ఉక్కు ఉద్యోగి సీతిన అచ్చుతరావు విధి నిర్వాహణలో మృతిచెందగా, కాదని బుకాయించిన యాజమాన్యం జేసీఎల్ ఆదేశాలతో ఎట్టకేలకు నష్ట పరిహారం చెల్లించిందని మృతుని భార్య లక్ష్మి తెలిపారు. 2016లో స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదవశాత్తు అచ్చుతరావు మృతిచెందారు. అయితే ప్రమాదవశాత్తు మరణం కాదని, నష్ట పరిహారం చెల్లించేది లేదని యాజమాన్యం నిరాకరించడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు రాష్ట్ర కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మరణ కాలం నుంచి నష్ట పరిహారం చెల్లించాలని జేసీఎల్ ఆదేశించింది. అయినప్పటికీ ఆ ఆదేశాలను బేఖాతరు చేయడంతో రామ అప్పారావు మళ్లీ కార్మికశాఖ అధికారులను సంప్రదించడంతో... స్టీల్‌ప్లాంట్ అధికారులు పరిహారం చెల్లించని పక్షంలో 50 శాతం అదనంగా చెల్లించాలని ఆదేశించడంతో యాజమాన్యం ఎట్టకేలకు పట్టువీడి చెల్లింపులు చేసిందని ఆమె పేర్కొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

పెదగంట్యాడ: మహిళల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు వనజాక్షి అన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం సీపీఐ పని చేస్తోందన్నారు. అనంతరం లంబోధర స్త్రీశక్తి టిడ్కో అభివృద్ధి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షురాలిగా కె.రమణి, ఉపాధ్యక్షులుగా ప్రమీల, వనజాక్షి, కార్యదర్శిగా పీత లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా జయలక్ష్మి, ఉమాదేవి, కోశాధికారిగా సింగిరెడ్డి లక్ష్మిని ఎన్నుకున్నారు.

సిరులతల్లి సన్నిధిలో శ్రావణలక్ష్మి పూజలు



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం 27వ రోజుకు చేరాయి. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య జరిగిన పూజలో 30 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

సిరులతల్లికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేయాలి'



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిటు ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఈవోఐ పేరుతో బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించే చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌లు జోక్యం చేసుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని, దీన్ని లాభాల బాటలో తీసుకొచ్చి కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటించిన రాష్ట్ర నేతలు ప్రైవేటీకరణపై నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. ప్లాంటులోని కీలక విభాగాలను 44 ముక్కలు చేసి ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిటు నాయకులు అప్పలరాజు, చిట్టిబాబు, రమణ, శేషు పాల్గొన్నారు.

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దు



స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పిస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో ఆర్థిక భారం పెంచేందుకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అందరూ వ్యతిరేకించాలని సీపీఎం గాజువాక జోన్ కమిటీ సభ్యుడు ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కలిగే నష్టాలపై జీవీఎంసీ 76వ వార్డు పరిధి ఎస్టీ కాలనీలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాప కింద నీరులా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రజలంతా వాటిని అడ్డుకోవాలని కోరారు. ఇప్పటికే సర్ చార్జీలు, కస్టమ్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలతో ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. ఈ స్మార్ట్ మీటర్లతో మరింత భారం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గొలగాని అప్పారావు, బంగారు నాయుడు, రమణ, లక్ష్మి, శ్రీదేవి, రాము తదితరులు పాల్గొన్నారు.